క్లుప్తంగా

సికింద్రాబాద్ డీసీకి పదోన్నతి

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి.దశరథ్‌కు పదోన్నతి లభించింది. ఆయనకు గ్రేడ్ వన్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన దశరథ్‌ను శుక్రవారం పలువురు జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అభినందించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సత్తా


చాతుర్యదేవి


షేక్ తబ్రేజ్


జోషితా చౌదరి

సనత్‌నగర్: సీబీఎస్ఈ బోర్డు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతితో పాటు 12వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని చాతుర్యదేవి గుజ్జారు అత్యధికంగా 500 మార్కులకు గాను 486 (97.2 శాతం), షేక్ తబ్రేజ్ అహ్మద్ 482 (96.4 శాతం), జోషితా చౌదరి 481 (96.2 శాతం) మార్కులు కైవసం చేసుకున్నారు.

లిటిల్‌స్కాలర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


నాగ శౌరీష్ (482)

లిటిల్‌స్కాలర్ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభను కనబర్చారు. గారినె ఆదిత్య వెంకటనాగ శౌరీష్ అత్యధికంగా 500 మార్కులకు గాను 482 (96.4) శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం శౌరీష్‌కు అభినందనలు తెలిపారు.

దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: జంట నగరాల ప్రజలకు అందుబాటులో దుబాయ్ సిటీలో ఉన్న కట్టడాల నమూనాతో ఎగ్జిబిషన్ ఏర్పాటు కావడం అభినందనీయమని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బుర్జ్ ఖలీఫా, భారీ టవర్స్‌తో ఉన్న ఈ ఎగ్జిబిషన్‌లో రెండు వందల స్టాళ్లు ఏర్పాటు చేశారని, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు రూపొందించిన వస్త్రాలు, వివిధ కళాఖండాలు, జ్యువెలరీ, చికాన్‌వర్క్స్ దుస్తులు, మన రాష్ట్రానికి చెందిన పోచంపల్లి, నిర్మల్ పెయింటింగ్స్ ఒకేచోట ప్రజలకు లభిస్తున్నాయ న్నారు. కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్యే కుమార్తె లాస్య నందిత. నివేదిత, నిర్వాహకులు రూబ్‌సన్స్, మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ఆటో డ్రైవర్ మృతి

రసూల్‌పురా: ఆటో నడుపుతుండగా ఫిట్స్ (మూర్ఛ) రావడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన కార్ఖానా పీఎస్ పరిధిలో జరిగింది. రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీకి చెందిన అయ్యారోలు సంతోష్ (45) ఆటో డ్రైవర్. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలో ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆటోను పక్కకు నిలిపిన సంతోష్ ఆటో స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. శంకర్ కుమారుడు సతీష్, భార్య మంజు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి అప్పటికే సంతోష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రైల్వే క్రెడిట్ సొసైటీ ఎన్నికలకు కార్యాచరణ

సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పాలక మండలి పదవీ కాలం త్వరలో ముగియనున్నందున తదుపరి ఎన్నికల ప్రక్రియను సిద్ధం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని సొసైటీ అధ్యక్షుడు కావూరి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ పాలకమండలి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ప్రస్తుత పాలక మండలి పదవీకాలం ముగుస్తుందన్నారు. కొత్త ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విశ్రాంత రిజిస్ట్రార్ ఎ.వెంకటరెడ్డిని నియమించామన్నారు. సకాలంలో ఎన్నికల నిర్వహణ, విధి విధానాల పకడ్బందీ అమలు వంటి వాటికి తమ నేతృత్వంలోని పాలకమండలి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ఇళ్ల జోలికొస్తే ఊరుకోం


బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


హాజరైన స్థానికులు

ప్రతి ఇంటికీ రక్షణగా ఉంటా: ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధి బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బస్తీలో పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. బస్తీలో ప్రతి ఇంటికీ తాను రక్షణగా ఉంటానని స్పష్టం చేశారు. సంబంధిత శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన ఎక్స్‌టెన్షన్‌లో పర్యటించారు. కొందరు తమ ఇళ్లను ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇళ్లను విక్రయించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొందరు తమకు తామే ఇళ్లను విక్రయించుకుంటున్నారని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బస్తీవాసులంతా కలసికట్టుగా ఉండాలని, ఆక్రమణదారులు ఎవరైనా దౌర్జన్యానికి దిగితే రాళ్లతో తరిమికొట్టాలన్నారు. ఇళ్లు అమ్ముకునేందుకు ప్రయత్నించే వారితో గానీ, గోదాములు ఏర్పాటు చేసుకున్న వారితో గానీ తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పేదల ఇళ్ల జోలికి వస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. కోర్టు స్టేటస్‌కో ఇచ్చినప్పటికీ కొందరి ఇళ్లను ఎలా కూల్చివేశారంటూ ఎమ్మెల్యే నిలదీశారు. సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్లు వేశారని, అయితే రోడ్లు వేయడంలో ఇబ్బంది ఏమిటన్నారు. అధికారులు తమాషాలు చేయవద్దని, రోడ్లు వేయని పక్షంలో అధికారి ఇంటి ముందు కూర్చొని ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేష్, సామల పాండు, స్థానిక నాయకులు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్డు సిబ్బంది పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు

బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీ గణేష్


సీఈఓ మధుకర్‌నాయక్‌కు వార్డుల్లోని సమస్యలు వివరిస్తున్న శ్రీ గణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ సిబ్బంది పక్షపాత ధోరణితో పనిచేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీ గణేష్ ఆరోపించారు. శుక్రవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్‌ను కలిసి వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ, బోర్డు సిబ్బంది కొందరు స్థానిక రాజకీయ నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పక్షపాత ధోరణికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సీఈఓను కోరామన్నారు. తాను ఇటీవల వివిధ వార్డు పరిధిలో పర్యటించిన సందర్భంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. చాలా ప్రాంతాల్లో తాగునీరు. డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్ల సమస్యలు ఉన్నాయని, ఆయా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సీఈఓను కోరామన్నారు. రెండో వార్డు ఇందిరమ్మ నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్న విషయాన్ని సీఈఓకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిశీలించాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ తగిన విధంగా చర్యలు తీసుకుంటామని హామీచ్చారన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, మల్లేష్, శరత్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌కు కదలివచ్చిన జలమండలి అధికారులు


క్యూఐడబ్ల్యూపీఎస్‌తో పైప్‌లైన్‌ను చెక్ చేస్తున్న జలమండలి అధికారులు

సాక్షి కథనానికి స్పందన

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట లక్ష్మీనగర్‌లో నెలకొన్న కలుషిత నీటి సరఫరా వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 12 (శుక్రవారం)న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. శుక్రవారం జలమండలి సీజీఎం ప్రభు, స్థానిక మేనేజర్లు కదలి వచ్చి సమస్య ఉన్న ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి నీటి కాలుష్యానికి గల కారణాలను పరిశీలించారు. క్యూఐడబ్ల్యూపీఎస్ కెమెరా ద్వారా పైప్‌లైన్ అంతా తనిఖీ చేశారు. కొన్ని రోజుల క్రితం మెట్టుగూడ చింతబావి ప్రాంతంలో కలుషిత నీరు తాగి దాదాపు 350 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు ప్రస్తుతం లక్ష్మీనగర్‌లో కలుషిత నీటి సరఫరాను అరికట్టే వరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని నిర్ణయించి శుక్రవారం నుంచే ట్యాంకర్ల ద్వారా సరఫరా మొదలు పెట్టారు. కార్యక్రమంలో తార్నాక డీజీఎం సరిత, మేనేజర్ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు స్థానిక నాయకుడు కె.కిరణ్ కుమార్ గౌడ్, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు


కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పెన్షన్లు తదితర పథకాలతో పాటు సీఎం సహాయ నిధిని నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ వర్తింపజేశామన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడం కోసం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసుకొనేవారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమ కార్యాలయానికి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, టీఆర్ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, రాజసుందర్, వెంకటేశ్, పాక సాయి, గీత, సుజాత పాల్గొన్నారు.

నేడు ప్రొ. ఓంకార్ సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి, దివంగత ప్రొ.ఓంకార్ సంస్మరణ సభను నేడు (13న) నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల పక్షాన కన్వీనర్ గురవారెడ్డి తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ఓంకార్ అభిమానులు, విద్యార్థులు, మిత్రులు, ఇతరులు హాజరుకావాలని కోరారు.

రూ.18 లక్షలతో సివరేజీ పైప్‌లైన్ పనులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ వెంకటేశ్వరనగర్‌లో రూ. 18 లక్షల వ్యయంతో నూతన సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జలమండలి సెక్షన్ మేనేజర్ నవ్య, శ్రీకాంత్‌లతో కలిసి శుక్రవారం ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రానున్న రోజుల్లో ఇబ్బంది కలగకుండా 250 ఎంఎం పైప్‌లైన్లు వేస్తున్నామని, డివిజన్‌లోని పల ప్రాంతాల్లో కలుషిత జలాల సమస్యలను పరిష్కరించేందుకు నూతనంగా సివరేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని కార్పొరేటర్ హేమ చెప్పారు.

పేద విద్యార్థులకు 'ఆపద్బంధు ఫౌండేషన్' అండ

కంటోన్మెంట్: ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్న పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆపద్బంధు ఫౌండేషన్ చైర్మన్ దత్తేశ్వర రావు అన్నారు. హస్మత్‌పేటకు చెందిన అనీషా ఫాతీమాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు పిల్లలను చదివించుకోవడం భారంగా మారింది. తన పిల్లల చదువు కొనసాగించేందుకు తగిన సాయం చేయాల్సిందిగా ఆపద్బంధు ఫౌండేషన్‌ను ఆశ్రయించగా, వారి చదువుకు సహకారం అందిస్తామన్నారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ షేక్ కరీమ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థి అదృశ్యం


అదృశ్యమైన రోహిత్‌రాజ్

చిలకలగూడ: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ కథనం ప్రకారం.. మహ్మద్‌గూడకు చెందిన రోహిత్‌రాజ్ (19) గతేడాది ఇంటర్ ఫెయిలయ్యాడు. సప్లమెంటరీతో పాటు ఈ ఏడాది కూడా పరీక్షలు రాయగా ఐదు సబ్జెక్టుల్లో తప్పాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించడంతో పాటు సన్నిహితులు, బంధు మిత్రులను వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తండ్రి సోమేష్ పోలీసులను శుక్రవారం ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ నరేష్ తెలిపారు.

ఎట్టకేలకు గణపతి ఆలయ స్థలం స్వాధీనం

56 ఏళ్ల కబ్జాకు చెక్ పెట్టిన అధికారులు


దేవాదాయ శాఖ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కంటోన్మెంట్: ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉన్న సికింద్రాబాద్ గణపతి ఆలయానికి చెందిన స్థిరాస్తులను ఎట్టకేలకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న 430 గజాల విస్తీర్ణంలోని స్థలంలో వెలిసిన రెండు దుకాణాలు, ఇళ్లను సీజ్ చేసి స్వాధీన పర్చుకున్నారు. మరో రెండు దుకాణాలను సైతం త్వరలోనే తమ ఆధీనంలోకి తీసుకుంటామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... రేపూరి నర్సింహులు అనే వ్యక్తి రెజిమెంటల్ బజార్‌లోని 430 గజాల స్థలంలో ధర్మశాల ఏర్పాటు చేసిన అప్పటి గాంధీ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఆశ్రయం కల్పించేవారు. 1920 నుంచి 1940 వరకు ధర్మశాలను కొనసాగించిన నర్సింహులు.. ఆ స్థలాన్ని అప్పటి నిజాం ప్రభుత్వానికి అప్పగించారు. నర్సింహులు అనంతరం ఆయన వారసుల ఆధ్వర్యంలో కొంత కాలం ధర్మశాల కొనసాగినప్పటికీ, 1960లో సదరు స్థలం సికింద్రాబాద్ గణపతి ఆలయ పరిధిలోకి వచ్చింది. 1967లో ఆలయ అర్చకులు భీమ్‌రావుకు ఇక్కడే వసతి కల్పించగా, ఆయన తన పేరిట పత్రాలు సృష్టించుకుని ఇతరులకు విక్రయించేందుకు యత్నించినట్లు ఆరోపణలున్నాయి. అతడిపై చర్యలు తీసుకునేందుకు ఆలయ అధికారులు యత్నించగా, భీమ్‌రావు సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించి ఇళ్లు ఖాళీ చేయించకుండా ఆర్డర్ తెచ్చుకున్నాడు. నాటి నుంచి అధికారులు, భీమ్‌రావు మధ్య కొనసాగుతున్న వివాదం ఎట్టకేలకు హైకోర్టుకు చేరింది. 2022 డిసెంబర్‌లో కోర్టు తీర్పు దేవాదాయ శాఖకు అనుకూలంగా వచ్చింది. దీంతో శుక్రవారం అధికారులు కోర్టు ఆదేశాలతో భారీ పోలీసు బందోబస్తు నడుమ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, జాయింట్ కమిషనర్ రామకృష్ణ, తహసీల్దార్ సునీత, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఈఓ వినోద, ఆలయ్య చైర్మన్ ఓదెల సత్య నారాయణ, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, డీఐ కోటయ్య, ఎస్ఐ శివశంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 58, 59పై అవగాహన

కంటోన్మెంట్: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలు వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మారేడుపల్లి ఆర్ఐ మల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మోండా డివిజన్ అంబేద్కర్ నగర్‌లో పర్యటించి స్థానికులకు స్థలాల క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించారు. జీఓ 58, 59 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ బస్తీ నాయకులు రైతు రాజయ్య, చిన్న వీరయ్య, పంగ రాజయ్య, పి.వెంకటేశ్, నారాయణ, రాము పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్: బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం... ఓల్డ్ అల్వాల్‌కు చెందిన ఆమల లింగారెడ్డి (60) పట్టాలకు సమాంతరంగా నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ లింగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొని ఘటనా స్థలానికి వెళ్లిన రైల్వే పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పొదుపు సంఘాలతో మహిళలకు ఉపాధి


బ్యాంక్ అధికారులకు దరఖాస్తులు అందిస్తున్న పొదుపు సంఘాల ప్రతినిధులు

సికింద్రాబాద్: ఇంటి పట్టున ఉండే మహిళలు పొదుపు సంఘాల్లో చేరడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పొదుపు సంఘాల మహిళల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలుగా ఏర్పడటం, తద్వారా రుణాలు పొందడం, వృత్తిపరమైన వ్యాపారాలు చేసుకోవడం వంటి అంశాలపై ఆమె మహిళలకు అవగాహన కలిగించారు. చిన్న మొత్తాలను పొదుపు చేసుకోవడం ద్వారా పెద్దమొత్తాల రుణాలు పొందే పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా కొత్తగా రుణాలు పొందడం కోసం పలు పొదుపు సంఘాలకు చెందిన దరఖాస్తులను సదస్సుకు హాజరైన బ్యాంకు అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో యూసీడీ అధికారి ధనుశ్రీ, పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

దారి దోపిడీ నిందితులకు రిమాండ్

కంటోన్మెంట్: ప్రయాణికుడిని దారి మళ్లించి దోపిడీ చేయడంతో పాటు చంపుతామని బెదిరించిన ఎనిమిది మంది నిందితులను మారేడుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లాకు చెందిన గగులోతు లక్ష్మణ్ గురువారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. జేబీఎస్‌కు వెళ్లేందుకు ఆటో కోసం ఎదురు చూస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు యువకులు లక్ష్మణ్‌ను జేబీఎస్ తీసుకెళ్తామంటూ తమ వెంట తీసుకెళ్లారు. లక్ష్మణ్‌ను మహంకాళీ టెంపుల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఉన్న మరో నలుగురు వ్యక్తులతో కలిసి లక్ష్మణ్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న రూ.1200 నగదు లాక్కుని, ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరించారు. బాధితుడిని కేంద్రీయ వద్ద వదిలి పారిపోయారు.బాధితుడు మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు కౌశిక్, కరుణాకర్, గిరీష్, బాల ఉమేశ్, వెకంట రమణ నాయుడు, ప్రణయ్, ఆకాశ్, నవీన్ తదితరులను నిందితులుగా గుర్తించి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

వైద్యులు అంకిత భావంతో పని చేయాలి

- టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజలు వైద్యులను మరో దైవంగా చూస్తారు, ఇలాంటి తరుణంలో వైద్యులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేయాలని టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మెరుగుపర్చేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ., కంటోన్మెంట్ ప్రాంతంలో బస్తీవాసులు ఎక్కువగా ఉన్నారని, ఈ ప్రాంతంలో వైద్య సేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలోని వైద్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రసూల్‌పుర, ఎన్‌బీకే నగర్ తదితర ప్రాంతాల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటితో కలిసి సందర్శించి మెరుగుపరచాల్సిన అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలపై డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యారోగ్య శాఖ అధికారి డా.వెంకటి సూచించారు.

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం...స్థిరపడని నిరుద్యోగులు

టీఎస్, ఓయూ జేఏసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ కోసం ముందు వరుసలో నిలబడి పోరాడిన విద్యార్థులు, నిరుద్యోగులు పదేళ్ల స్వరాష్ట్ర పాలన పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం టీఎస్, ఓయూ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి, అధ్యక్షుడు నవీన్‌యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, నిరుద్యోగుల జీవితాలు స్థిరపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ఓటర్లను దృష్టిలో పెట్టుకొని పథకాలను ప్రవేశపెట్టి విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్లక్ష్యం చేస్తూ గతంలో ఎన్నడులేని విధంగా 11 ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతినిచ్చి పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రత్యక్షంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉన్నందునే ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదన్నారు. గత పదేళ్లలో అవినీతి అక్రమాలు అన్ని శాఖలకు విస్తరించిందున నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు నవీన్‌యాదవ్, శివరాత్రి ప్రశాంత్, నీరడి సూర్యం, నాగరాజుగౌడ్, రాజేష్, నరేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు


వెంకట్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. శుక్రవారం తుకారాంగేట్ వెంకట్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, బస్తీల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే తుకారాంగేట్‌లో సీసీ రోడ్డుతో పాటు బస్తీలో రాకపోకలు సజావుగా సాగేలా మెట్లదారి పనులను కూడా ప్రారంభించామన్నారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సహకారంతో రానున్న రోజుల్లో డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీను, జీహెచ్ఎంసీ డీఈ పద్మలత, ఏఈ వేణు, పార్టీ నేతలు వడ్డెర ఎల్లయ్య, వడ్లూరి రవి, వసంత, మహ్మద్, గౌస్, నర్సింగ్, దేవయ్య, శకుంతల పాల్గొన్నారు.